

శ్రీకృష్ణుడి కోసం రైల్వే స్టేషన్..

శ్రీకృష్ణ భగవాన్ కోసం రైల్వే స్టేషన్ నిర్మించారంటే ఆశ్చర్యపోతున్నారా.. నంద్యాల జిల్లాలో ఉన్న ఆ స్టేషన్ గురించి తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే. 8లో▸



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన మయూరి నృత్యాలయ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.75
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.969
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:41,313
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:53,079

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. చాగలమర్రి మండలంలో అత్యధికంగా 34.4 మి.మీ, ఆత్మకూరు మండలంలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్ష పాతం నమోదైంది. అదే విధంగా ఆళ్లగడ్డలో 22.2, శిరివెళ్ల, గోస్పాడులో 21.6, డోన్, పాములపాడులలో 18.8, బనగానపల్లెలో 18.6, నంద్యాల అర్బన్ 18.4, నంద్యాల రూరల్ 17.6, వెలుగోడు, జూపాడుబంగ్లాలో 13.8, అవుకు 13.2, సంజామల 11.0, మిడుతూరు, మహానంది 10.2, కోవెలకుంట్ల, బేతంచెర్ల 9.2, రుద్రవరం 8.8, కొలిమిగుండ్ల 8.4, ఉయ్యాలవాడ 7.6, పగిడ్యాల 6.8, దొర్నిపాడు 6.4, బండిఆత్మకూరు 6.2, గడివేముల 5.8, ప్యాపిలి 4.6, నందికొట్కూరు 4.2, శ్రీశైలం 2.4మి.మీ వర్షం కురిసింది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

మూడు గేట్ల నుంచి నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గుతుండడంతో తెరిచిన గేట్లను ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నాటికి మూడు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు 79,269 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం నుంచి ఆదివారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి శ్రీశైలంకు 1,83,263 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్ట్‌లకు జలాశయం నుంచి 2,25,017 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 1,23,396 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 69,862 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 29,333 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,426 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 4.80 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 15.251 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.868 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 195.6605 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 881.40 అడుగులకు చేరుకుంది.

ఉప్పొంగిన వేదావతి నది

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామం వద్ద వేదావతి నది ఉప్పొంగింది. దీంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వేదావతి నదికి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరింది. అతి కష్టంపై నదిలో పుట్టి ప్రయాణం చేస్తూ ప్రజలు ఆంధ్ర రాష్ట్రంలోని గూళ్యం గ్రామానికి చేరుకుంటున్నారు. నదిపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నది ఉప్పొంగడంతో ప్రయాణికుల అవస్థలు

సా..గుతున్న పనులు.. మురిగిపోనున్న నిధులు!

రూ.15.51 కోట్ల జెడ్పీ నిధులతో 348 పనులు

- ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద రూ.5.91 కోట్లతో 127 పనులు
- ఇప్పటి వరకు 13 పనులు మాత్రమే పూర్తి
- ఈ నెలాఖరుకు పూర్తి చేయకుంటే ల్యాప్స్ అయ్యే ప్రమాదం
- ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఇచ్చిన 51 పనుల్లో 37 పనులు పెండింగ్
- రెండు పర్యాయాలు రిమైండర్లు రాసినా ఫలితం శూన్యం
- బిల్లుల చెల్లింపులో సీఎఫ్ఎంఎస్ జాప్యం



వెలుగోడు మండలం రేగడగూడురులో మరమ్మతులు చేసిన అంగన్‌వాడీ భవనం



ఓర్వకల్లులోని అంగన్‌వాడీ భవనానికి నిర్మించిన ప్రహరీ

స్థాయీ సంఘాల్లో ప్రశ్నిస్తున్నా..

జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జెడ్పీ స్థాయీ సంఘాల్లో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి పలుమార్లు సంబంధిత ఇంజనీరింగ్ శాఖలకు చెందిన అధికారులను కోరుతున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగని పరిస్థితి. మిగిలిన గ్రాంట్ల పరిస్థితి ఎలా ఉన్నా ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద చేపట్టిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా పురోగతి లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సీఎఫ్ఎంఎస్‌లో జాప్యం జరుగుతోందని ఆందోళన

జిల్లా పరిషత్ మంజూరు చేసిన పనులకు నిధులున్నా, చేసిన పనులకు అనుగుణంగా బిల్లులను అప్‌లోడ్ చేసినా, సీఎఫ్ఎంఎస్‌లో జాప్యం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. గతంలో జెడ్పీ మంజూరు చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు నేరుగా ట్రెజరీ ద్వారా జరిగేది. ప్రస్తుతం బిల్లులను సీఎఫ్ఎంఎస్ లాగిన్‌కు పంపితే అక్కడ వారు ఓకే చేస్తున్నారు. ఈ కారణంగా బిల్లుల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా పలు పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయలేకపోతున్నారని ఇంజనీరింగ్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.15.51 కోట్లతో 348 పనులను మంజూరు చేసింది. ఇందులో ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు కూడా వాటా మేరకు నిధులను కేటాయించి పనులను అప్పగించారు. అయితే ఈ పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. జిల్లా పరిషత్ సాధారణ నిధులు, 10 శాతం కాంట్రిబ్యూషన్/సెక్టోరియల్ యాక్టివిటీస్ కింద చేపట్టిన పనుల్లో కొంత జాప్యం జరిగినా, పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ఈ ఏడాది సెప్టెంబర్ 5లోగా సబ్‌మిట్ చేయాల్సి ఉంది. అలాగే పురోగతిలో ఉన్న పనులను కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉంది. లేని పక్షంలో మంజూరు చేసిన పనులు కాస్తా ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉంది.

ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద చేపట్టిన పనులు

➡ షెడ్యూల్డు కులాల సంక్షేమానికి(15 శాతం నిధులు) రూ.2,18,95,000 నిధులతో 52 పనులను మంజూరు చేశారు. ఈ నిధులతో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైన్స్, కమ్యూనిటీ హాల్స్ మరమ్మతులు తదితరాలను చేపట్టే అవకాశం ఉంది. అయితే ఈ పనుల్లో ఇప్పటి వరకు 8 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 44 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా ఆదోని పీఆర్ ఈఈ పరిధిలో 16 పనులు, నంద్యాల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పరిధిలో 12 పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

➡ షెడ్యూల్డు తెగల సంక్షేమానికి(6 శాతం నిధులు) రూ.78 లక్షలతో 17 పనులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 3 పనులు పూర్తి కాగా, 14 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నిధులతో ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల్లో అత్యధికంగా కర్నూలు పీఆర్ ఈఈ పరిధిలో 4, ఆదోని పీఆర్ ఈఈ పరిధిలో 4 పనులు ఉన్నాయి.

➡ మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలు, శిశు గృహాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు(15 శాతం నిధులు) రూ.2.94 కోట్లతో 58 పనులను మంజూరు చేశారు. ఇప్పటి వరకు 2 పనులు మాత్రమే పూర్తి కాగా, 56 పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పనుల్లో అత్యధికంగా నంద్యాల పీఐయూ ఈఈ పరిధిలో 22, కర్నూలు పీఆర్ ఈఈ పరిధిలో 11 పనులు పెండింగ్‌లో ఉన్నాయి.



కర్నూలులోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు

నత్తనడకన మిగిలిన గ్రాంట్ల పనులు

➡ జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పలు రకాల పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి.

➡ జెడ్పీ సాధారణ నిధులు(23 శాతం) రూ.5.64 కోట్లతో 119 పనులను మంజూరు చేశారు.

➡ ఇప్పటి వరకు 78 పనులు మాత్రమే పూర్తి కాగా.. మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

➡ గ్రామీణ నీటి సరఫరా విభాగానికి(12 శాతం నిధులు) రూ.1.89 కోట్లతో 51 పనులను మంజూరు చేయశారు.

➡ కేవలం 14 పనులను మాత్రమే పూర్తి చేశారు.

➡ వేసవిలో ఈ పనులను పూర్తి చేయాలని జెడ్పీ పాలకవర్గం ఎంత ఒత్తిడి చేసినా, నేటికి పనులు పూర్తి కాకపోవడం గమనార్హం.

➡ సెక్టోరియల్ యాక్టివిటీస్ కింద (10 శాతం నిధులు) రూ.1.85 కోట్లతో 51 పనులకు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 8 పనులు పూర్తి కాగా, 43 పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

బడ్జెట్ ల్యాప్స్ ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నాం



ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయకుంటే కేటాయించిన బడ్జెట్ ల్యాప్స్ అయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత ఇంజనీరింగ్ శాఖలను హెచ్చరించాం. ఇదే విషయాన్ని స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ ప్రత్యేకంగా సమీక్షించారు. పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరుతున్నాం. – జి.నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు



జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఇయర్ మార్క్‌డ్ ఫండ్ కింద చేపట్టిన పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన డీఈఈలతో మాట్లాడి ఆయా పనులను పూర్తి చేయాలని కోరాం. నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదాన్ని వారికి గుర్తు చేసి పనులను పూర్తి చేయాలని చెబుతున్నాం. బిల్లుల జాప్యం కారణంగా ముందుకు రాని కాంట్రాక్టర్లతో కూడా ప్రత్యేకంగా మాట్లాడుతున్నాం. – ఎస్ఈసీ మద్దన్న, పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈ





సచివాలయ భవనంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

సచివాలయమే రక్ష



శిథిలావస్థకు చేరి మూతబడిన పోలీసు స్టేషన్ భవనం

ఎంతో చరిత్ర కలిగిన చాగలమర్రి పోలీసు స్టేషన్ నేడు శిథిలావస్థకు చేరింది. బ్రిటీష్ వారి హయాంలో నిర్మించిన భవనం కావడం..ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పైకప్పులు దెబ్బతిన్నాయి. దీంతో ఏ సమయంలో పెచ్చులూడుతాయో..ఎప్పుడు పైకప్పు కూలుతుందోనని పోలీసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఈ భవనం పరిస్థితి మరీ ప్రమాదకరంగా మారడంతో నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ కార్యాలయంలోకి పోలీసు స్టేషన్‌ను మార్చడం జరిగింది. గత వారం నుంచి పోలీసులు ఈ సచివాలయం నుంచే విధులు నిర్వహిస్తున్నారు.

స్టేషన్ చరిత్ర ఇదీ

బ్రిటీష్ వారి హయాంలో నిర్మితమైన చాగలమర్రి పోలీసు స్టేషన్ భవనం నాడు శిరివెళ్ల తాలూకా కార్యాలయానికి ధనాగారంగా ఉండేది. ఆ తర్వాత పాలనా సౌలభ్యంలో భాగంగా ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు కావడంతో అక్కడే తాలూకా కార్యాలయం ఏర్పాటు చేసి అందులోనే ధనాగారాన్ని నిర్మించంతో ఈ భవనం స్టేషన్‌గా మార్పు చెందిందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఏదిఏమైనా ఉన్నతాధికారులు స్పందించి విశాల మైదానంలో పూర్తిస్థాయి సౌకర్యాలతో ఉన్న ఈ పోలీసు స్టేషన్ భవనాన్ని మరమ్మతులు లేదా పునర్నిర్మాణం చేపట్టి వినియోగంలో తేవాలని వారు కోరుతున్నారు. – చాగలమర్రి



చాగలమర్రి పోలీసు స్టేషన్‌గా మారిన గ్రామ సచివాలయం

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తం

నంద్యాల: జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఈదురు గాలులు, మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచించిందన్నారు. ఈ మేరకు వర్షాల సహాయక చర్యల నిమిత్తం నంద్యాల కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ (నెంబరు 08514–293903) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కంట్రోల్ రూమ్ 24/7 ప్రకారం పనిచేస్తుందన్నారు. ఏదేని అనుకోని అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నదులు, వంకలు పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉన్న చోట ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని, ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా నీరు ప్రవహించే కల్వర్టుల వద్ద వాహనాల రాకపోకలను నియంత్రించాలన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

మంత్రాలయంలో జిల్లా న్యాయమూర్తులు



మంచాలమ్మ ఆలయ ఆవరణలో న్యాయమూర్తులు

మంత్రాలయం రూరల్/కౌతాళం:ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్రస్వామిని ఆదివారం జిల్లా జడ్జి కబర్ది, ఆదోని రెండవ ఆదనపు జిల్లా జడ్జి సుధ, ఆదోని సబ్ జడ్జి నారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. న్యాయమూర్తులకు పూలమాల, శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు మంచాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ఉరుకుంద ఈరన్నస్వామిని కూడా వారు దర్శించుకున్నారు. శ్రావణమాస ఉత్సవాలపై ఈఓ వాణిని అడిగి జిల్లా న్యాయమూర్తులు తెలుసుకున్నారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, పర్యవేక్షకుడు వెంకటేష్, కౌతాళం సీఐ అశోక్‌కుమార్ ఉన్నారు.

'తల్లీబిడ్డ'కు అనారోగ్యం!

- జిల్లాలో 19 వాహనాలతో సేవలు
- టైర్లు అంతంత మాత్రమే
- ఎక్కడ నిలిచిపోతాయో తెలియని దుస్థితి
- డ్రైవర్లకు సకాలంలో అందని వేతనాలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



ఆళ్లగడ్డలో బ్యాటరీ పని చేయక నిలిచిపోయిన వాహనాలు

గోస్పాడు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఇళ్లకు చేర్చే వాహనాలకు 'చంద్ర' గ్రహణం పట్టింది. వివిధ సమస్యలతో వాహనాలు షెడ్లకు పరిమితమైనా రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు చేయడం లేదు. అరకొర జీతాలు సరిపోక డ్రైవర్ల ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. నంద్యాల జిల్లాలో 19 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగానికి 6, డోన్‌కు 3, ఆళ్లగడ్డకు 2, శిరివెళ్ల, ఆత్మకూరు, బనగానపల్లె, వెలుగోడు, నందికొట్కూరు, బేతంచెర్ల, కోవెలకుంట్ల, శ్రీశైలం ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.

ఇవీ ఇబ్బందులు..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణ (మెయిన్‌టినెన్స్) సక్రమంగా లేదు. ఇంజిన్ ఆయిల్, బ్యాటరీలు తరచూ మార్చకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. టైర్లు అరిగిపోవడంతో పంక్చర్ అవుతూ ఎక్కడ నిలిచిపోతాయో తెలయక డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. వాహనంలో వైపర్లు, బ్యాటరీలు, లైట్లు కూడా సక్రమంగా పనిచేయని దుస్థితి నెలకొంది.

సేవలు కుదింపు

➤ గతంలో ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాకు కూడా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలు అందించేవారు. రెండు నెలలుగా ఈ సేవలను ఆపేశారు.

➤ గతంలో 50 కిలోమీటర్ల నుంచి 100, 150 కిలోమీటర్ల వరకు తల్లీబిడ్డ వాహనం వెళ్లేది. ఇటీవల 30 నుంచి 50 కిలోమీటర్ల వరకు కుదించారు.

➤ ఒక తల్లి, బిడ్డ, వారి సాయంగా ఉన్న ఒకరిని మాత్రమే గమ్య స్థానానికి తీసుకెళ్లాలి. ఫలితంగా తల్లులు అవస్థలు పడుతున్నారు.

➤ తల్లికి ఒక చోట, పుట్టిన బిడ్డకు మరో చోట చికిత్స అందించాల్సి ఉంటుంది. అత్యవసర చికిత్స అందించేందుకు దూరప్రాంతాల ఆసుపత్రులకు రెఫర్ చేస్తే అక్కడ కోలుకున్నాక డిశ్చార్జ్ చేసిని వారిని తిరిగి ఇళ్లకు చేర్చడం లేదు. దీంతో చేసేది లేక తల్లీబిడ్డలు వారి ఆర్థిక స్తోమతను బట్టి ప్రైవేట్ వాహనదారులను, ఆటోలను ఆశ్రయిస్తూ ఇళ్లకు చేరుతున్నారు.

డ్రైవర్ల వేతనాల చెల్లింపులో అలసత్వం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న 21 మంది డ్రైవర్లకు నెలకు రూ.7,870 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఈ మొత్తం కూడా నెలనెలా చెల్లించడం లేదు. వాటి చెల్లింపులోనూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నాలుగు నెలలకు గాను రెండు రోజుల క్రితం రెండునెలల వేతనాన్ని చెల్లించారు. బకాయిలు విడుదల చేయాలని ఇప్పటికే వారు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వేతనాలు రాని కారణంగా కుటుంబ పోషణ కష్టంగా మారిందని డ్రైవర్లు వాపోతున్నారు.

మెరాయింపు ఇలా..

➤ జిల్లాలోని 19 వాహనాల్లో వైపర్ బ్లేడ్లు లేవు. వర్షాకాలం కావడంతో వాహనాలు బయటికి వెళ్లిన సమయంలో ఉన్నట్లుండి వర్షం వస్తే వాహనం ముందుకు కదల్లేదు.

➤ పది వాహనాలకు టైర్లు దెబ్బతిన్నాయి. స్టెప్నీ టైర్లు కూడా లేదు. గత రెండు రోజులుగా బనగానపల్లె వాహనం నిలిపోయింది.

➤ గత 20 రోజుల క్రితం నంద్యాల, వెలుగోడులలో వాహనాలు నిలిచిపోయాయి. టైర్లు వచ్చేవరకు తిరగలేని పరిస్థితి.

➤ కోవెలకుంట్లలోని వాహనానికి బ్యాటరీ లేక దాదాపుగా తొమ్మిది నెలలు గడుస్తోంది.

➤ గతంలో వాహనాలకు డీజిల్ కొరత ఉండేది కాదు. ప్రస్తుతం నెలకు రెండు ఫుల్ ట్యాంకులు దాటితే ఉన్నతాధికారుల అనుమతులు తప్పనిసరి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వాహనాలకు బాగాలేని టైర్ల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తల్లీబిడ్డల సేవలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. –నవీన్‌కుమార్, జిల్లా మేనేజర్

న్యాయం చేయాలి



పదేళ్లుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు కెప్టెన్‌గా పనిచేస్తున్నా. అప్పటి నుంచి రూ.7,870 మాత్రమే వేతనంగా ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఎన్నోమార్లు అధికారులను, మంత్రులను, ముఖ్యమంత్రికి విన్నవించాం. ఇప్పటికైనా రాష్ట్రంలో పనిచేసే 550 కుటుంబాలకు న్యాయం చేయాలి. –బసవరాజు, ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు


అవస్థలు పడుతున్నాం



వేతనాలు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వానికి, అధికారులకు విన్నవిస్తున్నాం ఫలితం లేకుండా పోయింది. కుటుంబ పోషణ భారంగా మారింది. – శ్రీనివాసులు , ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

ఆటోలపై 'కూటమి పిడుగు'

- ఉచిత బస్సుతో ఆటోవాలా జీవనోపాధిపై ప్రభావం
- రూ. 15 వేల హామీ అమలు చేయాలని డిమాండ్



ప్రయాణికులు లేక స్టాండ్‌లో నిలిచిన ఆటోలు

కొలిమిగుండ్ల: డ్రైవింగ్ వచ్చి ఆటో చేతిలో ఉంటే చాలు కుటుంబాన్ని పోషించుకోవచ్చనే ధీమాతో ఉన్న వారు ఇప్పుడు డీలా పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పేరిట ఉచిత బస్సు పథకం సాఫీగా సాగిపోతున్న ఆటోవాలా జీవన ప్రయాణంపై పిడుగులా పడింది. ఇప్పటికే ఇంటికో బైక్, కారు ఉండటంతో ఆటోలు ఎక్కే వారి సంఖ్య చాలా తగ్గిపోతుంది. ఫ్రీ బస్సు ఏర్పాటుతో ఆటో డ్రైవర్లు మరింత కష్టాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు ఆటో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 150కి పైగానే మూడు, నాలుగు చక్రాల ఆటోలు ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తూ రోజుకురూ. 500 నుంచి రూ. 700 మేర సంపాదిస్తుండేవారు. ఆటోల్లో ఎక్కువ భాగం మహిళలే ప్రయాణించే వారు. రెండు రోజుల నుంచి ఆటోలు ఎక్కే వాళ్లు లేక ఉదయం నుంచి సాయంత్రం వరకు ఖాళీగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉచిత బస్సు పథకంతో తమ బతుకు బండి నడిచేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సర్వీసులు లేని గ్రామాల్లో మాత్రమే కొంత వరకు మహిళలు ఆటోల్లో వెళుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.10 వేలు అకౌంట్లలో జమ కావడతో కొంత వరకు ఊరట కలిగించిందన్నారు. ఆ డబ్బుతో వాహనాల ఆటోల ఫిటెనెస్, బీమా ఇతర అవసరాలకు ఉపయోగించుకునే వాళ్లమని గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో వాలాలకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, 14 నెలలు అవుతున్నా ఆ ఊసేత్తడం లేదన్నారు. కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారిందని, ఆటోవాలాలకు చేయూత ఇవ్వాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక గురువు శివైక్యం



శ్రీ రాజరాజేశ్వరి (ఫైల్)

ఆదోని అర్బన్‌: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరి దేవస్థాన ఆస్థాన వాసులు, ఆధ్యాత్మిక గురువు రాజరాజేశ్వరి ఆదివారం తెల్లవారుజామున శివైక్యమయ్యారు. ఈమె1983 సంవత్సరంలో నెల్లూరు నుంచి మంత్రాలయానికి, అక్కడి నుంచి ఆదోనికి వచ్చారు.స్థానిక హనుమాన్‌నగర్‌లో ఓ చిన్న గుడిసెలో ఉంటూ ఆధ్యాత్మిక, ధార్మిక చింతనతో గడుపుతూ 1987లో రాజరాజేశ్వరి దేవస్థానాన్ని నిర్మించారు. ఆ తర్వాత పేదల కోసం కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. అయితే, ఆదివారం తెల్లవారుజామున ఆయాసం అధికం కావడంతో ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే రాజరాజేశ్వరి తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, మీనాక్షినాయుడు, ఎమ్మెల్యే డా.పార్థసారథితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం అమ్మవారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

- ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరీంనగర్ నుంచి రాయచోటికి వెళ్తున్న కారు సాయిబాబా గుడి వద్ద పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ శివ తెల్లవారుజామున నిద్రలోకి జారుకోవడంతో జరిగిన ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు కారును బయటకు తీశారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల రైలు మార్గంలో గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. నంద్యాల రైల్వే ఎస్ఐ కుమారి తెలిపిన వివరాల మేరకు గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలోని గేటు దాటిన తర్వాత ఉన్న మార్గంలో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం గుర్తించామన్నారు. మృతి చెందిన వ్యక్తి మెడలో ఎర్రటి తాయత్తు ఉందని, నల్లటి రంగు టీ షర్టు ధరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

అవుకు(కొలిమిగుండ్ల): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు అవుకు మండలంలో మెట్టుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అవుకు కస్తూర్బా పాఠశాలలో పోస్టు ఇప్పిస్తామని అదే మండలానికి చెందిన ఓ మహిళతో డబ్బులు వసూలు చేశాడు. పోస్టు విషయంపై బాధితురాలు అతన్ని ప్రశ్నించడంతో జాబ్‌కు సంబంధించిన ఓ లెటర్ వాట్సాప్‌లో పెట్టి కొద్ది సేపటికే తొలగించాడు. ఈ విషయంపై ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఓ ప్రజాప్రతినిధితోపాటు, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేను కించపరిచేలా మాట్లాడాడు. దీనికి సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బాధితురాలు అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మోసానికి పాల్పడిన వ్యక్తి ఓ యూట్యూబ్ చానల్‌లో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

కృష్ణుడి కోసం రైల్వే స్టేషన్!

- కృష్ణమ్మ కోన రైల్వే స్టేషన్ ప్రత్యేకం
- రైల్వే అధికారులు కృష్ణుడికి గుడి, స్టేషన్ నిర్మించారని ప్రతీతి



కృష్ణమ్మ కోన పేరు మీద ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్

బేతంచెర్ల: రాజుల కాలం నుంచి ఇప్పటి వరకు చాలా మంది దేవుడి కోసం ఆలయాలు నిర్మించడం తెలుసుకానీ.. ఇక్కడ శ్రీకృష్ణ భగవాన్ కోసం రైల్వే స్టేషన్ నిర్మించారంటే ఆశ్చర్యపోతున్నారా.. ప్రయాణికుల కోసం స్టేషన్ ఏర్పాటు చేసి ఉంటారే అని కొట్టిపారేసేందుకు చుట్టు పక్కల పల్లెలు కూడా లేవు. స్టేషన్ చుట్టూ కొండ ప్రాంతం. గుంటూరు – గుంతకల్లు రైల్వే మార్గంలో పాణ్యం – సిమెంట్ నగర్ రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న కృష్ణమ్మ కోన రైల్వే స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది. బ్రిటీష్ పరిపాలనలో ఏర్పాటు చేసిన ఈ రైలు మార్గంలో వెళ్లే రైళ్లు, గూడ్స్ కృష్ణమ్మ కోన ప్రాంతానికి రాగానే ఆగిపోయేవి. కారణం తెలియక చాలా మంది రైల్వే అధికారులు ఈ ప్రాంతం గురించి ఆరా తీశారు. స్వయంగా ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. సమీపంలోని ఆవుల కాపరి దగ్గరకు వెళ్లి ఇక్కడ ఏవైనా దేవాలయాలు ఉన్నాయా? అని అడగటంతో సమీపంలో కృష్ణుని విగ్రహం చూపించారు. స్వామి దర్శనం చేసుకున్న రైల్వే అధికారులు 'కృష్ణమ్మ కోన'పేరుతో రైల్వే స్టేషన్ ఏర్పాటుతో పాటు గుడి నిర్మాణం చేపడతామన్నారు. అనుకున్న ప్రకారం బ్రిటిష్ పాలనలో కృష్ణమ్మ కోన పేరుతో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. తదనంతరం అక్కడ గుడి నిర్మాణం కూడా వారు చేపట్టారు. రైల్వే స్టేషన్ ఏర్పాటుతో పాణ్యం, బేతంచెర్ల, నంద్యాలతో పాటు గుంటూరు, గుంతకల్, కర్నూలు ప్రాంత భక్తులే కాకుండా బనగానపల్లె మండలం రామతీర్థం, నందివర్గం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ప్రతి ఏకాదశితోపాటు శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ప్రతి శనివారం కందికాయపల్లె, సిమెంట్ నగర్ గ్రామాలే భక్తులే కాకుండా పాణ్యం, నంద్యాల నుంచి వచ్చిన భక్తులు భజనలు చేస్తుంటారు.



రుక్మిణి సత్యభామ, సమేత శ్రీ కృష్ణుడు



కృష్ణుడి ఆలయం

మహావిష్ణువు జగన్మోహిని అవతారం ఇక్కడే..

కొండ కోనలు, పచ్చని ప్రకృతి అందాల మధ్య ఉన్న కృష్ణమ్మ కోనలో రుక్మిణి సత్యభామ సమేత కృష్ణుడు వెలిసి భక్తుల చేతల పూజలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న కథనం మేరకు.. మహావిష్ణువు జగన్మోహినిగా ఇక్కడే అవతరించారని తెలుస్తోంది. కృతయుగంలో తపస్సుతో శివుడిని మెప్పించి ఎవరిపైనా సరే తలపై చేయి పెడితే భస్మమయ్యే వరం పొందిన భస్మాసురుడే చివరకు ఇక్కడే భస్మం అయ్యారని తెలుస్తోంది. దేవతలను సైతం భస్మాసురుడు సంహరించే ప్రయత్నం చేస్తుండగా మహావిష్ణువు కృష్ణమ్మ కోన సమీపంలో జగన్మోహిని అవతారం ఎత్తి భస్మాసురుని ఆకర్షిస్తాడు. భస్మారుడు కామంతో జగన్మోహిని పొందాలనుకుంటాడు. అప్పుడు విష్ణువు కొలనులో శుద్ధిగా స్నానం చేసి రావాలనే నిబంధన పెడతాడు. కొద్దిపాటి నీరు ఉన్న కొలనులోకి భస్మాసురుడు వెళ్లి స్నానం చేస్తూ తలపైన నీళ్లు చల్లుకుంటూ చేతులు తన తలపైనే పెట్టుకోవడంతో భస్మం అవుతాడు. భస్మాసురుడిని అంతం చేయడానికి శ్రీమహావిష్ణువు జగన్మోహిని అవతారం ఎత్తడంతోనే ఈ ప్రాంతాన్ని కృష్ణమ్మ కోనగా పిలుస్తారనే కథ ప్రాచుర్యంలో ఉంది.



భస్మాసురుడు భస్మమైన కోనేరు

రైళ్లు ఆగిపోయేవట



బ్రిటిష్ కాలంలో గుంటూరు– గుంతకల్ రైల్వే లైన్ ఏర్పాటు చేశాక వచ్చిపోయే రైళ్లు, గూడ్స్ బండ్లు ఆగిపోయేవట. ఏమి చేయాలో తోచక సిబ్బంది ఉన్నతాధికార్లకు సమాచారం ఇవ్వడంతో ఇక్కడకు వచ్చి ఆలయాన్ని సందర్శించి కృష్ణమ కోన పేరు మీదుగా స్టేషన్ ఏర్పాటు చేసినట్లు మా పెద్దలు చెప్పేవారు.

– రామసుబ్బయ్య, సిమెంట్ నగర్ గ్రామం

సంతాన వరప్రదాయుడు



స్వామి వారు భక్తుల కల్ప తరువు. సంతాన వర ప్రదాయుడిగా ఖ్యాతి పొందారు. ఎంతో విశిష్టత ఉన్న ఆలయాన్ని దర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని నమ్మకం భక్తుల్లో ఉంది. పండుగ పర్వదినాలు శనివారం రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణుడిని దర్శించుకుంటారు. సంతానం లేని వారు స్వామి వారిని సేవిస్తే ఫలితం ఉంటుంది.

– ఆలయ పూజారి కిట్టన్న



కృష్ణమ్మ కోన స్టేషన్‌ను ఆధునీకీకరించిన దృశ్యం

మాల ఉద్యోగుల ఐక్యతే మాల్గోవ ధ్యేయం

- జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వైపీ సోమన్న, డా.వై రాజశేఖర్

కర్నూలు(అర్బన్‌): మాల ఉద్యోగుల ఐక్యతే ధ్యేయంగా మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (మాల్గోవ) పనిచేస్తుందని మాల్గోవ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయానంద్, రామకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జెడ్పీలోని ఎంపీపీ హాల్‌లో మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాల ఉద్యోగులకు మాల్గోవ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు, అడిషనల్ సెక్రెటరీ హెచ్‌డీ ఈరన్న , అరవింద్, ఉమా మహేశ్వర్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా జిల్లా నూతన కార్యవర్గం ....

మాల్గోవ జిల్లా అధ్యక్షుడిగా వీపీ సోమన్న, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వై రాజశేఖర్, కోశాధికారిగా రాముడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా నాగన్న, సుధాకర్‌బాబు, డాక్టర్ సృజన్, డాక్టర్ రాజేష్, అడిషనల్ జనరల్ సెక్రెటరీలుగా ఓబులేసు, పుల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా మైలా బాబు రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వీరేష్, నారాయణ, మహిళా వింగ్ కార్యదర్శులుగా సుష్మ, జ్యోతి, విజయకుమారి, లీగల్ అడ్వైజర్‌గా జయరాజ్, గౌరవ సలహాదారులుగా రిటైర్డు డీఎస్పీలు దేవదానం, వేల్పుల జయచంద్ర, రిటైర్డు ఈఈ రాగప్ప, గౌరవాధ్యక్షుడిగా పాండురంగయ్య, చిరంజీవిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని సభ్యులను సన్మానించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన మాల్గోవ జిల్లా నూతన కార్యవర్గం

కొత్తూరులో ప్రముఖుల పూజలు



పూజల అనంతరం జడ్జి కమలాదేవికి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు చేశారు. కర్నూలు అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, నంద్యాల జిల్లా అడిషినల్ ఎస్పీ యుగంధర్‌బాబు, ఇంటెలిజెన్స్ ఎస్పీ చాముండేశ్వరిదేవితో పాటు పలువురు ఉన్నతాధికారులు స్వామిని దర్శించుకున్నారు. ఈఓ రామకృష్ణ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

సుళువాయిలో దాహం..దాహం!



సుళువాయి తాగునీటి కోసం ఇబ్బందులు పడ్తున్న గ్రామస్తులు



తోపుడు బండిలో నీరు తెచ్చుకుంటున్న యువకుడు

- విరుపాపురం స్కీం నుంచి అందని తాగునీరు
- ఇక్కడ ఇంటికో తోపుడు బండ్లు

హొళగుంద: వర్షాలు కురుస్తూ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నా సుళువాయి గ్రామంలో మాత్రం తాగునీటి ఎద్దడి నెలకొంది. విరుపాపురం వాటర్ స్కీం నుంచి వారానికో, రెండు వారాలకో మంచినీరు వస్తుండగా అవి సరిపోక గ్రామ ప్రజల దాహంతో అల్లాడుతున్నారు. విరుపాపురం నీటి పథకం నుంచి మంచినీరు సక్రమంగా వదలటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామానికి సక్రమంగా నీరు అందడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి సర్పంచ్ మౌలాలి తీసుకెళ్లినా ఫలితం కనబడటం లేదు. దీంతో గ్రామంలో చాలా వరకు ఇంటికి ఒక తోపుడు బండిని పెట్టుకుని బోర్ల ద్వారా మినీట్యాంకులకు ఎక్కించే నీటిని తీసుకెళ్తున్నారు. ఆ నీటిని తాగేందుకు, వాడుకకు ఉపయోగిస్తున్నారు. అందుబాటులో ఉన్న ఒకటి రెండు బోరు, చేతి పంపుల వద్ద నీటి కోసం యుద్ధానికి దిగుతున్నారు. అధికారులు స్పందించి విరుపాపురం వాటర్ స్కీం నుంచి నీటి సరఫరాను సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. ఆదివారం సి.క్యాంపు సెంటరులోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషిలిటీస్ సెంటరు ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ట్రెజరీ అధికారులు, సిబ్బందికి, పెన్షనర్లకు లివర్ స్కానింగ్, ప్యాట్ స్థాయి, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు మాట్లాడుతూ..పెన్షనర్లందరూ వయోవృద్ధులే అయినందున వారి ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషిలిటీస్ సెంటరు డాక్టర్లతో పాటు ఏటీవో రఘువీర్, ఎస్‌టీవో విక్రాంత్, కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న నంది విజయలక్ష్మి

కర్నూలు(అర్బన్‌): రాష్ట్రంలో విద్యార్థి, ప్రజా సంఘాల హక్కులను కూటమి ప్రభుత్వం హరిస్తోందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆరోపించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విద్యాసంస్థల ఆవరణలోకి విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు బయటి ప్రపంచానికి తెలియకూడదనే కుట్రతో ప్రభుత్వం ఇలాంటి నియంతృత్వ పోకడలతో ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతూ.. సమస్యలపై గట్టిగా పోరాడాలని చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేడు ఇలాంటి జీఓలు ఇవ్వడం దారుణమన్నారు. జీఓను రద్దు చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మహిళా నేతలు ఈడిగ భారతమ్మ, పాలెం రాధ, హుస్సేన్‌బీ, ఎలీషమ్మ, ఈరమ్మ, ఖాసింబీ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి హృదయాల ఆనంద గీతం



పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

కల్లూరు: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 25 ఏళ్ల తర్వాత వారు ఒక చోటికి చేరారు. చిన్నప్పుడు తమ పాఠశాల అందించిన అనుభవాలను గుర్తు చేస్తున్నారు. అప్పటి విద్యాబోధనపై ముచ్చటించుకున్నారు. బాల్యం జ్ఞాపకాల్లో మునిగి తేలారు. కల్లూరు మండలం పర్ల గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో 1999-200 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన 75 మంది విద్యార్థుల్లో పలువురు ఉన్నత చదువులు చదివి దేశ, విదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా ఆత్మీయ సమావేశానికి హాజరై అప్పట్లో చదువు చెప్పిన గురువులు రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిన్నయ్య, ద్వారకనాథ శాస్త్రి, మీనాక్షినాయుడు, తైమూర్ బాషా, సంపత్, జి. నగేష్, అన్వర్ బాషా, గోదాదేవి, కల్పన, జ్యోతితో పాటు ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను మెమోంటోలు అందజేసి శాలువ కప్పి సత్కరించారు. నాడు వారు బోధించిన చదువు, క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించామని చెబుతూ పాదాభివందనం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు ఎప్పుడూ తమవంత సహాయ సహకారాలు అందజేస్తామని ప్రకటించారు.



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దేశభక్తి గీతం ఆలపిస్తున్న పూర్వ విద్యార్థి

రిటైర్మెంట్ బకాయిలు ఇప్పించండి

- సాంఘిక సంక్షేమ గురుకులాల రిటైర్డు ఉద్యోగుల ఆందోళన



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్

కర్నూలు(అర్బన్‌): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆ అసోసియేషన్ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గురుకులాల్లో రిటైర్డు అయిన ఉద్యోగులకు నేటి వరకు ఈఎల్ చెల్లించలేదన్నారు. అలాగే మెడికల్ బిల్స్‌ను మంజూరు చేయడం లేదని, ప్రభుత్వం రిలీజ్ చేసిన డీఏ అరియర్స్ కూడా చెల్లించలేదన్నారు. పీఆర్‌సీ అరియర్స్, హాఫ్‌పే లీవ్స్, వన్ మంత్ ఎర్న్‌డ్ లీవ్స్, యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ అరియర్స్, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్స్ కూడా రిటైర్డు అయిన ఉద్యోగులకు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని బిల్లులను ప్రభుత్వం ఆమోదించాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. రంగస్వామి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 450 మంది రిటైర్డు అయ్యారన్నారు. పదవీ విరమణ అయ్యాక వచ్చే డబ్బుతో ఏమి చేయాలనే ప్రణాళికలు ఉద్యోగులకు ఉంటాయని, తాము దాచుకున్న సొమ్మును ఇవ్వడంలో కూడా ప్రభుత్వాలు జాప్యం చేయడం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సకాలంలో ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందక తీవ్ర మానసిక క్షోభకు గురై పలువురు ఉద్యోగులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు చీఫ్ సెక్రెటరీ, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, గురుకులాల సొసైటీ కార్యదర్శిని ప్రత్యక్షంగా కలిసి విన్నవించినా, నేటికి ఎలాంటి ఫలితం కనిపించడం లేదని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ నేతలు బాలభాస్కర్, వాసుదేవరెడ్డి, గంగాధర్, వీర ప్రసాద్, తిరుపాలయ్య, సత్యన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులు స్పందించారు..

గుంతలు పూడ్చారు!

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు నగరం, శివారు ప్రాంతాల్లో అడుగడుగునా రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయని, గుంతలు 'మెరుస్తున్నాయి' అని సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఆదివారం పూడ్చి వేయించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్లను బాగు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

భారత్ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ప్యాచ్‌లు వేస్తూ..



గుంతలను తవ్వి పూడుస్తూ..

2,500 హెక్టార్లలో పంట నష్టం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 2,500 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అయితే అధికారుల లెక్కలు మాత్రం 700 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు చెబుతున్నాయి. ఇప్పటికే పత్తి, కంది, వేరుశనగ, ఉల్లి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం వరకు చిప్పగిరిలో మినహా మిగిలిన మండలాల్లో వర్షాలు కురిశాయి.పలు మండలాల్లో వర్షాలు తేలికపాటికే పరిమితం అయ్యాయి. అత్యధికంగా ఆదోనిలో 49.8 మి.మీ వర్షపాతం నమోదు అయింది. కృష్ణగిరిలో 26, పెద్దకడుబూరులో 25.4, దేవనకొండలో 24.8, మద్దికెరలో 23.8, కౌతాళంలో 16, ఆస్పరిలో 15.2, పత్తికొండలో 14.4 మి.మీ. ప్రకారం వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 11.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆగష్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 156.6 మి.మీ. నమోదైంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో కూడ జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు.